తెర మరుగు


కల్యాణ మండపం, అపార్ట్‌మెంట్‌గా మారిన మధు థియేటర్

అభిమాన హీరో కొత్త సినిమా రిలీజయిందంటే చాలు థియేటర్ల వద్ద సందడే సందడి. జనవరి 1, సంక్రాంతి, దసరా, దీపావళి ఇతర ప్రత్యేక సందర్భాల వేళ ప్రేక్షకుల కోలాహలం అంతా ఇంతా కాదు. నాడు టూరింగ్ టాకీస్‌లుగా వినోదాన్ని అందించిన సినిమా థియేటర్లు నేడు ఆదరణ కరువై గోడౌన్లు, వ్యాపార సముదాయాలుగా మారిపోతున్నాయి. గత కొన్నేళ్లలో శ్రీకాళహస్తిలో సగానికి పైగా థియేటర్లు మూత పడ్డాయి.

- రూపు మారిన థియేటర్లు
- ఓటీటీలకు పెరుగుతున్న క్రేజ్
- మొబైల్లోనే సినిమాలు చూస్తున్న వైనం
- శ్రీకాళహస్తిలో సగానికి పైగా థియేటర్ల మూత

శ్రీకాళహస్తి : సినిమా రంగ ప్రవేశం చేసిన తర్వాత ప్రజలకు అతిపెద్ద వినోద సాధనంగా మారింది. సినిమాలు ప్రదర్శించడానికి ఒక్కొక్కటిగా థియేటర్లు వెలిశాయి. తొలినాళ్లలో సినిమా హాళ్లు ఒక వెలుగు వెలిగాయి. థియేటర్ల వద్ద నాలుగు ఆటల సమయాల్లో పండుగ వాతావరణం కనిపించేది. ఒక్కో సినిమా 100 రోజులకు పైగా ఆడిన సందర్భాలు ఉన్నాయి. అయితే రెండు దశాబ్దాల నుంచి థియేటర్లు పలు రకాలుగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మొదట్లో టీవీలు, ఇప్పుడు ఓటీటీలకు క్రేజ్ పెరగడంతో థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య రోజు రోజుకూ తగ్గుతోంది. దీంతో నిర్వహణ వ్యయం కూడా రాక థియేటర్లను యాజమాన్యాలు మూసివేస్తున్నారు. సినిమా హాళ్లపై ఆధారపడిన కార్మికులు ఉపాధి కరువై ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళుతున్నారు.

పెద్ద హీరోల సినిమాలు తగ్గడం

ఒకప్పుడు సినీ పరిశ్రమలో పెద్ద హీరోలు విరామం లేకుండా సినిమాల్లో నటించేవారు. ఏడాదిలో నెలకో పెద్ద హీరో సినిమా చొప్పున 12కు పైగా విడుదలవుతుండేవి. గరిష్ఠంగా 18 సినిమాలు విడుదలైన సందర్భాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు . దీంతో ప్రతినెలా అయిదు, ఆరు కొత్త సినిమాలు విడుదలవుతుండేవి. దీంతో థియేటర్లకు కనక వర్షం కురిసేది. అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. పెద్ద హీరోలు సినిమాలు తగ్గించుకోవడంతో ఏడాదిలో అయిదు, ఆరు మించి విడుదల కావడం లేదు. నాణ్యత, సాంకేతికత పేరుతో ఒక్కో హీరో సినిమా మూడు, నాలుగేళ్ల పాటు చిత్రీకరిస్తున్నారు. చిన్న హీరోల సినిమాలు, చిన్న బడ్జెట్ సినిమాలు ఎన్ని వచ్చినా హిట్ టాక్ వస్తేనే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. దీంతో ప్రేక్షకుల రాక తగ్గి థియేటర్లు వెలవెలబోతున్నాయి.ఒక్కో రోజు హాలుకు ఎవరూ రాకపోవడంతో షోలు వేయని రోజులు ఉన్నాయి.


రిలయన్స్ మార్ట్‌గా మారిన శ్రీరామహల్

మూత పడ్డ థియేటర్లు

కొన్నేళ్లలో శ్రీకాళహస్తిలో థియేటర్ల సంఖ్య 40 శాతానికి పైగా తగ్గిపోయింది. ప్రేక్షకులు తగ్గడంతో థియేటర్ నిర్వహణ ఖర్చులు కూడా రాకపోవడంతో యాజమాన్యాలు మూసివేస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఒకప్పుడు 10 థియేటర్లు ఉండగా ప్రస్తుతం 7 మూతపడ్డాయి. మూడు హాళ్లు మాత్రమే మిగిలాయి. ఒకటి రేణిగుంటలో మరొకటి ఏర్పేడులో మూతపడ్డాయి.

రూపు మార్చుకున్నాయి

మూతపడిన థియేటర్లు రూపుమార్చుకుంటున్నాయి.. శ్రీకాళహస్తిలో మధు థియేటర్ కల్యాణ మండపం, అపార్టుమెంట్‌గా మారాయి. వెంకటేశ్వర థియేటర్ కార్ పార్కింగ్ , సుజుకి సర్వీస్ సెంటర్‌గా , శకుంతల థియేటర్ కళాశాల, షాపింగ్ కాంప్లెక్స్‌గా , సాయిరాం, శ్రీనివాస, నివాస థియేటర్లు భవనాలుగా, బలరాం థియేటర్ వ్యాపార కేంద్రంగా, శ్రీరామ మహాల్ రిలయన్స్ మార్ట్ షాపింగ్ కాంప్లెక్స్‌గా మారిపోయాయి.

మొబైల్స్, టీవీలు.. ఓటీటీల దెబ్బ

సినిమా థియేటర్లకు ఆదరణ తగ్గడంలో ఒకప్పుడు టీవీలు, ఇప్పుడు ఓటీటీలు మొబైల్ ఫోన్లు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. టీవీ రంగ ప్రవేశం, కేబుల్ టీవీల సాంకేతికతతో పాత సినిమాలు టీవీల్లో ప్రదర్శితమవడంతో వీటిని చూసేందుకు థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. అనంతరం సినిమా చానళ్లు రావడంతో క్రమేపీ థియేటర్లకు వచ్చే జనం తగ్గారు. కరోనా విపత్తు నుంచి ఓటీటీ (ఓవర్ ది టాప్)కు క్రేజ్ పెరగడం, కొత్తగా విడుదలైన సినిమా మూడు నుంచి నాలుగు వారాల్లోనే అందుబాటులోకి రావడంతో ఇంటిలో నుంచే సినిమాలు చూసే ప్రేక్షకులు పెరిగారు. దీంతో పాటు సినిమా టికెట్, పార్కింగ్, ఇంటర్వెల్ సమయంలో స్నాక్స్, కూల్డ్రింక్ ధరలు చూసి కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సగటు ప్రేక్షకుడు థియేటర్లకు వెళ్లడాన్ని దాదాపు తగ్గించేశారు.


వ్యాపార కేంద్రంగా బలరాం థియేటర్

అధ్వానంగా ఆలత్తూరు రహదారి


గుంతలమయంగా ఆలత్తూరు, పీవీకండ్రిగ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి గ్రామాలకు కేటీ రోడ్డు నుంచి వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు వెంబడి రాళ్ల క్రషర్లు, క్వారీలు ఉన్నాయి. క్రషర్లు, క్వారీల నుంచి లారీలలో 50 టన్నులకు పైగా బరువు ఉన్న రాళ్ల మెటల్ నింపుకుని తీసుకుపోతున్నారు. దీంతో రోడ్డు దెబ్బతిందని గ్రామస్తులు చెబుతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు ఈ రహదారిలో వెళ్లాలంటే నరకం కనిపిస్తుంది. రోడ్డుపై పడిన గుంతలతో బస్సుల కట్టలు దెబ్బతింటున్నాయని, బస్సు సర్వీసులను నిలిపివేశారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.


ఓవర్ లోడ్‌తో వెళుతున్న లారీ

క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు


ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

సత్యవేడు : పంచాయతీలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఈనెల 24న 'అదోమహారాజ్యం' అనే కథనం 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైంది. దీనికి మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్, మండల ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి స్పందించారు. వారి ఆదేశాల మేరకు సత్యవేడు పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ ఆధ్వర్యంలో రామ్‌నగర్, ఆర్టీసీ రోడ్డు, కోటమిట్ట వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో పలు వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ చేయాలని సర్పంచులు, సచివాలయ కార్యదర్శులకు ఈఓపీఆర్డీ సూచించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నాయకుల నివాళి

శ్రీకాళహస్తి : పట్టణంలోని పాత బస్టాండు కూడలి వద్ద బుధవారం మాజీ ప్రధానమంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి అజాత శత్రువన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, డిల్లీబాబు, అమర్‌నాథ్, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాధురీగోల్డ్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన మాధురీ గోల్డ్ నిర్వాహకులు బుధవారం బసవయ్యపాళెం వద్ద ఉన్న కృపా మిషనరీ చర్చిలో వృద్ధులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రిస్మస్‌ను పురస్కరించుకొని పేదవారికి సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాధురీగోల్డ్ నిర్వాహకులు, సిబ్బంది, చర్చి పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచనలో రాజేష్ ప్రతిభ


రాజేష్‌ను అభినందిస్తున్న టీటీడీ డీఈఓ

తిరుపతి సిటీ : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన (తెలుగు) పోటీలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బీఏ మూడో సంవత్సరం విద్యార్థి టి.రాజేష్ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ప్రశంసాపత్రం, రూ.3వేల నగదు అందుకున్న విద్యార్థి రాజేష్‌ను బుధవారం కళాశాలలో టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ భాస్కరుడు, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున అభినందించారు.

'నాడోడి బతుకులు' ఆవిష్కరణ


నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : మూరిశెట్టి గోవింద్ రచించిన 'నాడోడి బతుకులు' నవలను రచయిత పలమనేరు బాలాజీ బుధవారం ఆవిష్కరించారు. యూత్ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ మాట్లాడుతూ యానాదుల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి ఈ నవల దర్పణం పట్టిందని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన ఆచార్య పీసీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో కూడా యానాది సామాజిక వర్గం అనాగరికులుగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత సాకం నాగరాజు, జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, తిరువాయిపాటి రాజగోపాల్, గోవిందయ్య, డాక్టర్ మౌని, ఇస్లాపురం బాలసుబ్రమణ్యం, జీఎస్ ప్రసాద్, మునిప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీటీసీ శేఖర్ కుటుంబానికి పరామర్శ


పుష్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాజేష్

నాగలాపురం : మండలంలోని ఎస్ఎస్‌పురం ఎంపీటీసీ శేఖర్ భార్య పుష్ప(45) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. సమాచారం అందుకున్న సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఎంపీటీసీ శేఖర్ ఇంటికి చేరుకుని పుష్ప మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొరై సుధా, నాయకులు ఆనంద్, రవి, ధనరాజ్, చిరంజీవి, దేశన్, దేశప్పన్, కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాగలాపురం : క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. బుధవారం క్రీడా మైదానంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నూకతోటి రాజేష్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు 40 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొరై, శ్యామ్, కులశేఖర్ రెడ్డి, దేశప్పన్, రాజామని, దేశన్, నారాయణ పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభానికి హాజరైన రాజేష్, నేతలు

గంగా మాతకు ప్రత్యేక పూజలు


చెరువు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాల గ్రామ చెరువు భారీ వర్షాలతో నిండి కలుజు పారడంతో గ్రామ మహిళలు బుధవారం గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చెరువులోని నీటిపై దీపాలు వెలిగించి పసుపు, కుంకుమ, పూలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలతో చెరువు నిండి కళకళలాడుతోందని, దీంతో పంటలకు నీటి కొరత లేకుండా, పంటలు బాగా పండి మంచి దిగుబడులు రావాలని పూజలు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సత్యవేడు : పంచాయతీ పరిధిలోని దేవాంగ సంఘం కమిటీ సభ్యులు ఆంగ్ల సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సంఘం అధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి యారాశి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు మన్నెం గణపతి, కోశాధికారి పోజల రవిబాబు ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి చెంచులయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట : రేణిగుంట ప్రాజెక్టు పరిధిలో రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ క్రిష్ణమంజరి తెలిపారు. ఏర్పేడు మండలం రాజులపాళెంలో అంగన్‌వాడీ కార్యకర్త(ఎస్సీ), శివగిరి ఎస్టీ కాలనీ (ఎస్టీ), అంగన్‌వాడీ సహాయకులు ఏర్పేడు మండలం కందాడు (ఓసీ), మునగలపాళెం (ఎస్సీ), పంగూరు(ఓసీ), మేర్లపాక(ఓసీ), అలాగే రేణిగుంట మండలంలోని అంగన్‌వాడీ సహాయకులు గాజులమండ్యం (ఓసీ), వినాయక నగర్ (బీసీ–బీ), మొలగమూడి(ఓసీ). జనవరి 06వ తేదీ సాయంత్రం 5గంటల లోపల రేణిగుంటలోని ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 97015 54149 నంబరును సంప్రదించాలని సీడీపీఓ తెలిపారు.

సత్యవేడు : నియోజవర్గ కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సత్యవేడు మండలం కొల్లడం (ఎస్సీ), వరదయ్యపాళెం మండలంలో రామిరెడ్డిపాళెం (ఓసీ), పులివెల్లం (ఎస్సీ) అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ దేవకుమారి తెలిపారు. 21 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు ఉన్న స్థానిక వివాహితలు అర్హులని తెలిపారు. ఈ పోస్టులకు పదో తరగతి పాసై ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను జనవరి 6వ తేదీ సాయంత్రం 4.30 గంటల్లోగా ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

దక్షిణద్వారం.. వాహనాలకు నిలయం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగు ద్వారాలు ఉంటే వీఐపీలు ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో బయట పార్కింగ్‌లో వాహనాలు నిలిపి నాలుగో ద్వారం నుంచి లోపలికి భక్తులను అనుమతించేవారు. వీవీఐపీల వాహనాలు మాత్రమే లోపలికి అనుమతి ఉండేది. అయితే మూడు నెలలుగా దక్షిణ ద్వారం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, దళారులు వాహనాలను లోపలికి తీసుకెళ్లి దక్షిణ ద్వారం నుంచి జ్ఞాన ప్రసూనాంబ సదన్ వరకు కారు పార్కింగ్ లాగా వాహనాలను నిలుపుతున్నారు. ఈ విషయంపై అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

రేపటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజులపాటు జాతీయ స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్, బంజారా జన్ సంఘ్ అధ్యక్షుడు హరిచౌహాన్ నాయక్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పౌరాణిక, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మాల్వా వెంకటేష్, వినోద్ రాథోడ్, రమేష్ బాబు, సీతారామ్, కిషోర్ పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజ సంస్కారం

తిరుపతి కల్చరల్ : సమాజాన్ని సంస్కరించేందుకు సాహిత్యమే సాధనమని పంచ సహస్రావధాని మేడసాని మోహన్ తెలిపారు. బుధవారం యూత్ హాస్టల్లో జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా రచయితల సంఘం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు.

ఏసు జననం.. లోక పావనం

లోకరక్షకుడు యేసయ్య జన్మించిన రోజైన క్రిస్మస్ పండుగను బుధవారం నియోజకవర్గంలో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పేలు చర్చిలలో కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకుంటూ క్రైస్తవులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా చర్చిలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యేసు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే అలంకరణలు ఆకట్టుకున్నాయి. చర్చిల వద్ద అన్నదానాలు, దుస్తుల పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు
- ప్రార్థనలతో పులకించిన చర్చిలు, మందిరాలు
- పలుసేవలతో దాతృత్వాన్ని చాటిన క్రైస్తవులు

రేణిగుంట : విద్యుత్ దీపాల వెలుగులో ఆర్ సీఎం చర్చి


శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో పలు చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు క్రైస్తవులు చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో చర్చిలో ఏర్పాటు చేసిన క్రీస్తు జననం వంటి దృశ్యాలు చూపరులను ఆకర్షించాయి. చర్చి ప్రాంగణంలో పేదలకు అన్నదానం చేశారు.

సత్యవేడు : క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు చూపిన మార్గం ఆదర్శం, ఆచరణీయమని ఫాదర్ చార్లెస్ రాబర్ట్ అన్నారు. సీఎస్ఐ చర్చిలో ప్రాత్యేక ప్రార్థనలు చేసి పేదలకు చీరలు దుప్పట్లు , నగదు పంపిణీ చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో ఘనంగా జరుపుకున్నారు. భక్తిగీతాలను ఆలపించి, ప్రార్థనలు చేశారు. పిల్లలు క్రిస్మస్ తాత , మేరీ మాత వేష ధారణలో ఆకట్టుకున్నారు.

నాగలాపురం : మండలంలో వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు ఆరాధనతో చర్చిలు కిటకిటలాడాయి. కార్యక్రమంలో సంఘ ఉపదేశకుడు హేమకుమార్, శిక్షణ పాస్టర్ పంజల్ సుకన్య, చర్చి పెద్దలు డాక్టర్ శేషాద్రి, పాల్ విక్రమ్, సంఘ సభ్యులు పాలొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చి, జీవాగ్రంలోని లూథరన్ చర్చిలో వైభవంగా వేడుకలు నిర్వహించారు.

వరదయ్యపాళెం : మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేకులు కోసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ : క్రిస్మస్‌తాత, మేరీ మాత వేషంలో చిన్నారులు


వరదయ్యపాళెం : చిన్న పాండూరు పెంతకోస్తులో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ పాల్ మహేష్


నాగలాపురం : క్రిస్మస్ సంబరాల్లో క్రైస్తవులు



రేణిగుంట : ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు, ఆకర్షణీయంగా బాల యేసు అలంకరణ


సత్యవేడు : ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


సత్యవేడు : సీఎస్ఐ చర్చి వద్ద క్రిస్మస్ సంబరాలు